# అధోలోకం

అబ్బబ్బ....ఎంత అసహ్యకరమైన చప్పుడు .... నీకే ఉందా కారు .... అంత భయంకరమైన హారన్ పెట్టుకోవడానికి .... "కొంట్యూ ఎనొవ్స్ యుపర్ కమింగ్ లైకే జంటిల్మన్" అన్నాడు ఏ. జి. గార్డ్నర్ (ఆన్ ది రూల్ ఆఫ్ ది రోడ్)....చిన్ననాడు చదువుకున్నదేమీ వెంట వెంటనే మరచిపోయే ఒక గొప్ప అలవాటు మనకు లేదన్నమాట. మన జ్ఞాపకశక్తి అద్భుతం. అందుకే బోలెడంత చెత్త ఈ బుర్రలో యెప్పుడూ మెదలుతూ వుంటుంది. అనవసర విషయాల్ని జ్ఞాపకం ఉంచుకోవడం— దానివల్ల అవస్థలు .... ఎవరో ఎక్కడో రాయగా చదివినట్లు జ్ఞాపకం.... యేదీ జ్ఞాపకం రాదే - మాలతీ చందూర్ అనుకుంటాను ప్రమదావనంలో. ఆంధ్రప్రభ యిప్పుడు పూర్తిగ ఆడవాళ్ళ పత్రిక అయిపోయిందేమిటి? పూర్తిగా ఆ పత్రికనిండా రచయిత్రుల పేర్లు తప్ప రచయితల పేర్లు కనిపించవే? ఏ సీతో. కౌసల్యో అని పేరు పెట్టుకొని మనమూ ఓ కథో, నవలో రాస్తే బహుమానం వచ్చేట్లుంది. అయినా ఈ రోజుల్లో ప్రతీవాడూ కథలు రాసేవాడే. ఆ మధ్య యేదో పత్రికలో చదివాను ఆంధ్రదేశంలో 1200 మంది కథకులున్నారని. ఆ పత్రిక నిర్వహించిన కథల పోటీలో పాల్గొన్నారని. ఈ పోటీకి రాయని కథకులెందరో? యింతమంది కథకులే అయితే ఆ కథల్ని చదివేవాళ్ళు కనీసం అంత మందైనా ఉన్నారా అని .... మాలతీ చందూర్ కొద్దిగా రాసినా బాగా రాసింది. 'చంపకం—చెదపురుగులు' మనిషిలోని పశుత్వాన్ని చాల చక్కగా చూపిస్తుంది. పూర్ చంపకం! తోటి స్త్రీలోని ఈర్ష్యా ద్వేషా లలో మాడిపోయిన ఒక కన్నీటికణం! మనిషిలో ఇంతటి ఈర్ష్యాద్వేషాలు ఎందుకుంటాయో."అన్నీ ప్రశ్నలే ప్రపంచంలోసమాధానాల్లేవు"....శ్రీశ్రీ

ఈ సమాధానాల కోసం ఎందరు ఎంతగా ప్రయత్నిస్తున్నారో! యిదేమిటీ ఇవ్వాళ యింత సీరియస్‌గా ఆలోచిస్తున్నాను? హెవీ స్టఫ్ ముళ్ళపూడి నిర్వచనం ....యెంత నడచినా రూం రాదేం.. అయినా ఎందుకొచ్చినట్లు అక్కడినుంచి కోటీవరకు....ఎక్కడా పొద్దుపోకసాయంత్రం అయ్యేటప్పటికి కోటీకి రాకుండా వుండడం యెంత కష్టం. ప్రతి రోజూ ఇలా సాయంత్రాలు ఏ పనీ పాటా లేకుండా ఇక్కడికి వచ్చే ఒక స్టూడెంటులోని యీ ఎలెమెంట్‌ను ఓ సైకియాట్రిస్టు యెట్లా ఎనలైజ్ చేస్తాడో. ఏ ఇన్‌స్టింక్టు ఏ మోటివ్ అతన్ని యిట్లా డ్రైవ్ చేస్తున్నదో. ఈ మధ్య సైకాలజీమీద యెక్కడలేని ఇంటరెస్టు పుట్టుకొస్తున్నది. అదుగో మళ్ళీ హారన్. ఈ కారు హారన్ వింటేనే యెక్కడలేని ఇరిటేషన్ పుట్టుకొస్తుంది. కారులో వాళ్ళని చూస్తే వాళ్ళు ఎందుకో మనకి శత్రువు లనిపిస్తుంది. వడ్డించిన విస్తరి మీ జీవితం! జ్ఞాపకం వస్తోంది. ఇది నీకు కారు లేదన్న వొక యేడుపు, వాడికి వుందన్న వొక జెలసీ కారణం కావచ్చు. నీకే కారువుంటే యిలా ఆలోచించేవాడివేనా? ఈ ప్రశ్నలకేంగాని ఆ కారులో ఉన్న అమ్మాయి కాస్త అందంగా ఉన్నట్లుందే. సరిగ్గా చూశ్శేదు మిస్‌డ్ ఎ ఛాన్స్....అదేమిటి ఆ బోర్డు 'తీన్ కన్య' లిబర్టీలో .... సత్యజిత్‌రాయ్ చాల గొప్పవాడనిపిస్తాడు, ఆయన సినిమా వొక్కటైనా చూడకున్నా, కొంతమంది రచయితలుకూడ అలాగే షేక్స్పియర్ రాసిన వొక్కపంక్తి చదవకున్నా అతడు చాలా గొప్పవాడనిరాస్తారు. కాళిదాసుకన్నానా? యెవడో విమర్శకుడు కాళిదాసును షేక్స్పియర్ ఆఫ్ ఇండియా అన్నాడట. నాన్‌సెన్స్. క్లియోపాత్రా ముక్కు ఇంకాస్త పొట్టిగా ఉంటే ప్రపంచ చరిత్రే మారిపోయేది అన్నాడట ఎవడో చరిత్రకారుడు. క్లియోపాత్రా మొన్ననే వచ్చింది. అబ్బ ఎలిజబెత్ టేలర్ ఎంత బ్యూటిఫుల్‌గా వుంది! ఒక సీన్‌లో పూర్తిగా నేకెడ్‌గా యాక్టు చేసిందట. ఆ సీన్‌లో ఆమెను అట్లా చూడటం నా జీవితంలో మరచిపోలేని అనుభవం అన్నాడట రిచర్డు బర్టన్....వాటే లక్కీ ఫెలో .... పాడు ఇండియన్ సెన్సార్ కట్‌చేసింది. ఆ దృశ్యాన్ని చూడనిస్తుందా? ఈ సెన్సార్ లేకుంటే ఎంత బాగుండేది? సెన్సార్ కత్తెరకు నిర్దాక్షిణ్యంగా బలియైన యెన్ని మార్లిన్ మన్రో పిక్చర్సు యెన్ని బ్రిగిటీ బార్డాట్ పిక్చర్సు యేడుస్తూ

చూశాం ! మనం ఏ సెన్సార్ బోర్డు మెంబరో అయితే యెంత బాగుం డును ! లేక యే ఫ్రాన్స్‌కో, యిటలీకో వెళ్ళి వీళ్ళ పిక్చర్స్ చూసొస్తే!

అదుగో మళ్ళీ కారుహారన్, రిక్షావాళ్ళ చప్పుడు, అబిడ్ షాప్ కొట్టు, పుస్తకాల షాపు యేమేం పేపర్లు వున్నాయి? మహా కొనేవాడి లాగా యిట్లా చూడటం యెందుకో? యేదో దాహం ... యేదో ఆకలి, యెక్కడో యేదో కన్పిస్తుందన్న ఎన్నడూతీరని ఆశ. అదిగో లైట్ అండ్ షేడ్స్ మీద నూడ్.... ఫెయిర్ సెక్స్ మీద శరీరాన్ని పులకింపచేస్తున్న ఆ నూడ్!....అబ్బ, ఎన్నని చూడటం, అదిగో 'హిందూనేశన్' — బి. సరోజాదేవి "కొంపదీసి ఎవరైనా చూస్తున్నారా? కొంచెం దగ్గరగా వుంటే బాగుండేది. సరిగా కనిపించటంలేదు. ఒకకాపీ కొంటే ?ఛీ! బుద్ధిలేదు. మొదట బస్సు కిరాయిలేదు, తర్వాత బి. ఏ. చదువుతున్న విద్యార్థి, యెంతో సివిలైజ్‌డ్ అండ్ కల్చర్‌డ్ అనుకుంటున్న విద్యార్థి 'హిందు నేశన్' చదవడమా? యింకా యెంతసేపు యిట్లా చూస్తూ నిల్చోవడం ? అదిగో షాపువాడు 'నీపని యింతేనా' అన్నట్లు చూస్తున్నాడు. యిక్కడి నుంచి కదలాలి, ఛీ ! రూమ్ యెంతకూ రాదేం ? అదిగో ఆ రిక్షాలో పోతున్న అమ్మాయి బాగున్నట్టుంది. సాధనా హెయిర్ స్టయిల్, ఆ ముఖానికి యింకాస్త అందాన్నిచ్చిందేమో. ఈ మధ్య సాధన హెయిర్ స్టయిల్ చాల పాప్యులర్ అయిపోతోంది. సాధన ఎంత అందంగా వుంటుంది. హౌ ప్రెటీ షి యీజ్ !

'తుమ్హెజీవన్‌కే డోర్‌సే బాంద్ లియాహై' యిదేమిటి పైకి పాడేస్తున్నాను వాట్ నాన్‌సెన్స్ ! సినిమాలు యింత విరివిగా చూడటం ఈ యంగ్ పీపుల్ యెన్ని రకాలుగా పాడుచేస్తోందో వివరిస్తూ వొక వ్యాసం రాయాలి. సినిమా వుత్త పాసివ్ ఎంటర్టయిన్‌మెంట్ అన్నాడు రసెల్. పాపం రసెల్ ఎంత గొప్పవాడు ! పడిలోవున్నా అతనికి యింకా వరల్డ్‌ని యుద్ధంనుంచి రక్షించాలన్న ఆరాటం, జైలుకి పోవడం, అరె యెంత మంచిపాట వినిపిస్తున్నది. "ఛలో యేక్ బార్ ఫిర్‌సే' అజ్ నభీ బన్‌జాయే హమ్ దోనో" కాస్సేపు ఆగి వినిపోదాం. అట్లా వస్తున్న ఎఱ్ఱచీరె కట్టుకున్నామె మా కాలేజి స్టూడెంటు 'కుముదిని' లాగుందే ? ఔను ఆమె. ఎంత అందంగా వుంది? ఆ విశాలమైన కాటుకకళ్ళు, స్వచ్ఛ

మైన నీటిలో తళతళ మెరుస్తున్న చంద్రబింబంలాంటి ముఖానికి ఎంత ప్రకాశాన్నిస్తున్నాయి. పోతపోసిన విగ్రహంలాగావున్న ఆమె అవయవాల పొందిక, యౌవనం ప్రతి అంగంలోనూ వెల్లివిరుస్తోంది. కీట్సు అనుకున్న 'ఎ థింగ్ ఆఫ్ బ్యూటీ' యీమేనేమో! ఇలాగే చూస్తే కవిత్వం రాసిపారేసే టట్లున్నాను. ఇంత చక్కటి సాయంత్రం ఎక్కడికి వెళ్తుందో .... "యేకాంతమూ, సాయంత్రమూ యెద నీకై వెదికేనూ"....యిదేమిటి మళ్ళీ పాడేస్తున్నాను. ఎవరైనా వింటే నవ్వుతారు. ఇవ్వాళే రోడ్ సైడ్ రోమియో అని యేదో పత్రిక ఎడిటోరియల్ వ్రాసింది. ఎన్నిసార్లు ఆమెని కాలేజీలో చూశాం. అయినా ఎప్పటికప్పుడు ఆమెలో యేదో ఒక వినూత్నమైన అందం శోభిస్తుందేమిటి? మిస్ కాలేజ్, మిస్ ఇండియా ఆ మాటకొస్తే మిస్ వరల్డ్‌కి కూడా కంటెస్ట్ చెయ్యవలసిన యువతి యీమె.

బి. బి. లాగా ఎక్సయిట్‌మెంటును, స్టారమ్‌ను సృష్టించగల యువతి.... "ఆడదాని వోరచూపులో జగాన వోడిపోని ధీరుడెవ్వడూ" రికార్డు మార్చాడు హోటలువాడు. ఛీ థర్డ్‌షాప్. ఐనా వినడానికీ బాగానే వుంది. రోడ్డుమీద ప్రజలంతా ఆమెనే చూస్తున్నట్టున్నారు. ఆడదాని వోరచూపులో....యిదేమిటి పాడు అలవాటు. మళ్ళీ పైకి పాడేస్తున్నాను. అరే అతడు ఆ వైటుసూటులో వున్నతడు మా లెక్చరర్ కమలాకర రావు. అతడిక్కడున్నాడే? అబ్బ తెలిసింది, ఓహో! బ్రహ్మాండమైన రహస్యం తెలిసింది. అబ్బ హృదయమెంత తేలికపడింది. ఇన్నాళ్ళనుంచి కాలేజీలో వున్న రూమర్స్‌ను రూమర్స్‌కదా అనుకున్నాను. అయినా వాళ్ళతో, వాళ్ళతో చెప్పకుండా మానాలా.... చెప్పితే మాత్రం వెంటనే రూమర్స్ భాయీ అనలేదూ? కుముదినీ, కమలాకర్‌కు సంబంధం వుందని కాలేజీ గోడలన్నీ ఘోషించినయ్. గోడలమీద అంత అసభ్యంగా రాయడం ఎంత ఘోరం. ఇటీజ్ టూ యిన్‌డిసెంట్ ఆన్ ది పార్టు ఆఫ్ ది స్టూడెంట్....యెవరో ఆ పని చేసింది? అయితే యిప్పుడు వాళ్ళిద్దరూ కలసి పోతున్నారన్నమాట. ఛలో యేక్ బార్ ఫిర్ సే.... ఛీ మళ్ళీ అదేపాట. కాలేజీలో చెప్పుకునేవన్నీ నిజమేనన్నమాట. యెంత అమాయకుణ్ని. అవన్నీ నమ్మలేకపోయేవాడిని. టైమెంతైంది సార్?

పీడెవడు. ఈ దేశంలో గడియారం పెట్టుకోవడం పాపం. ప్రతీ వాడు టైం అడిగేవాడే. అబ్బ నీకు గనక వుందిలేవోయ్ ఆ బోడివాచీ.... ఐనా యింత సీరియస్‌గా ఆలోచిస్తుంటే యీ డిస్టర్బెన్స్ యేమిటి ? ఊఁ ఆరు న్నర....కాదు ఆరు ముప్పైరెండు. యెంతవరకొచ్చింది ? ఆ వీడు.... మురళి ప్రచారం చేసేవన్నీ నిజమే నన్నమాట. వాళ్ళిద్దరూ కలిసి సినిమా లకు పోతుంటే, రిక్షాలలో పోతోంటే యిద్దరూ ఒకరి కౌగిట్లో ఒకరు మైమరచిపోతోంటే ఐనా వాడెట్లు చూడగల్గెను ? యెంతసేపు ఇట్లా నిల్చోవడం ? పాటల మీదికి మనస్సు పోవడంలేదు.

యిప్పుడు వాళ్ళిద్దరూ కలసి ఎటు పోతున్నారో ...యెటుపోతారు? యే పబ్లిక్ గార్డెన్‌కో, యే టాంకుబండ్‌కో వెళ్ళి హాయిగా "యెంత హాయి ఈరేయి యెంత మధుర మీహాయి" మళ్ళీ పాట. లోకాన్ని యిట్లా కన్ను గప్పి వీళ్ళు చేస్తున్న పని యిదా ? నీ కెందుకింత యేడుపు ? యేం ? వాళ్ళిద్దరూ ప్రేమించుకున్నారు. అట్లాగే తిరుగుతారు. మధ్య నీ సొమ్మేం పోయింది ? ఔను. యిదేమిటి నేనిట్లా ఫీలవుతున్నాను ? వాళ్ళ ప్రేమను వోర్వలేని జెలసీనా యిందుకు కారణం ? వాళ్ళందరూ అట్లా గోడలమీద ఆ అసభ్యకరమైన రాతలన్నీ రాసినప్పుడు తను ఎంత బాధపడ్డాడు! అది అన్యాయమనీ, అనాగరికమనీ ఎంతోమందితో. వాదించాడు. వాదించావులే ...ఎక్కడెక్కడ యేమేం వ్రాశారో తెలుసు. కొన్ని అవన్నీ చదివి మరీ వచ్చావు. యురినల్స్‌లో, లేవెట్రీస్‌లోని బొమ్మలను, రాతలను యెన్నిసార్లు చదువలేదు? యేమిటో ఈ ఇన్‌స్టింక్ట్స్, యేమిటో ఈ క్యూరియాసిటీ! దీనికంతా కారణమేమిటో.... ఒక సైకి యాట్రిస్టు దగ్గరకు వెళ్ళి ఇదంతా చెబితే బాగుండును.

అబ్బబ్బ యేమిటో ఆలోచనలు, యెడతెగని ఆలోచనలు, యిక ఆలోచించను. ఐ యామ్ టైర్డ్ ఆఫ్ దిస్ హాబిట్. ఛలో మేక్‌బార్ ఫిర్‌సే .... యిదేమిటీ ఈ పాట యిలా రింగ్ ఔతోంది. హాంటింగ్ సాంగ్ అంటే యిదేనేమో ? వాళ్ళిద్దరూ పాటలు పాడుకుం టార్రా ? యీ పాటికి యెక్కడున్నారో? ఒకరి కౌగిలిలో యింకొకరు, ఒకరి పెదవులతో యింకొకరి పెదవులు రాక్‌హడ్సన్-గినాలొలో బ్రిగిడా లాగ ఓహ్ వాటే లైఫ్....ఛీ మన బతుకంతా యింతే. యెడారి. యెడ

తెగని యెడారి. రేపు కాలేజీకి వెళ్ళడంతోటే అందరితో చెప్పాలి వాళ్ళిద్దరూ చెట్టాపట్టాలేసుకుని హాయిగా కలిసిపోతోంటే చూశానని. ఇంకేమైనా వుందా? క్లాసెస్‌లోని నల్ల బోర్డులన్నీ నిండుతాయి, మళ్ళీ గోడలన్నీ నిండుతాయి. మురళి....వాడంటే యెందుకో భయమేస్తోంది.

వాడేమైనా చేయగలడు. రేపు "హిందునేశన్"లో వొచ్చినా రావచ్చు. మైగాడ్ యెంత ఈవిల్ నా హృదయం! ఆమె నాకేం అపకారం చేసింది? నా కెందుకు ఆమెమీద కసి? ఏమో నాకేం తెలుసు! చెప్పాలనిపిస్తోంది, ఐ కాన్ట్ హెల్ప్ఇట్. అయినా దీంట్లో చెప్పటానికేముంది. ఆమె యేదో షాపింగుకు రావచ్చు, యితడు ఏ హోటల్లోనో కాఫీ త్రాగటానికి రావచ్చు. అట్లా వాళ్ళిద్దరూ ఒకేసారి కన్పించడం యాక్సిడెంటల్ అని ఎందుకనుకోగూడదు? ఏమో అట్లా అనిపించడం లేదు, నిప్పులేందే పొగరాదు. వీళ్ళిద్దరి మధ్య యేదోలేందే కాలేజీనిండా యీ పుకార్లు యెందుకు పుడుతుంది? అబ్బ ఈ సమస్య ఎంత కాంప్లికేటెడ్ ఐపోయింది! ఆలోచించకూడదనుకొని మళ్ళీ యిదే ఆలోచిస్తున్నాను. జస్టు స, నువ్వు ఆమెకు ఎంత అపకారాన్ని తలపెట్టావు. నిష్కారణంగా ఆమెమీద పడిన ఈ నింద బైటి ప్రపంచానికి తెలుస్తుంది. ఆమె కారెక్టర్ మంచిది కాదనే ఒక ముద్ర పడిపోతుంది. ఆమెను ఎవ్వరూ పెండ్లి చేసుకోరు. ఆమె జీవితమంతా కృంగి కృశించిపోతుంది. అంతా నీ వూహ. కథలు, సినిమాలవల్ల వచ్చిన సంస్కారం. అది నిజం కాకూడదని ఎక్కడుంది? నిజమే ఐతే మాత్రం నీ మున్లేం పోయింది? నిన్నెవరు యినంతా ప్రచారం చెయ్యమన్నారు? నీ వంటి వాళ్ళంతా యీ సంఘానికి పిల్లర్స్. అందుకే యీ సమాజం వుత్త ఎమోషన్. ఆ టర్మ్స్‌కు వొక స్పష్టమైన అర్థంలేదు. దేనికీ అర్థం లేదు. ఆయనెవరో అన్నట్లు యిదంతా ఎ స్టోరీ టోల్డ్ బై యాన్ యిడియట్, ఫుల్ ఆఫ్ సౌండ్ అండ్ ఫ్యూరీ సిగ్నిఫయింగ్ నథింగ్. యేది ఆలోచించినా కన్‌క్లూజన్ యిదే. ఛీ యిక ఆలోచించను, హమ్మయ్య రూమ్ వచ్చింది.

అదిగో మురళి వస్తున్నాడు. వాడితో ఈ విషయం చెప్పేద్దామన్న నిర్ణయం మీదేవున్నానా.. వొద్దు చెప్పేస్తే.... చెప్పను చెప్పకూడదు. చెప్పేస్తే....చెప్పేస్తావా ?

హల్లో !

హల్లో మురళీ చెప్పేస్తావా ? వొద్దు వొద్దు చెప్పొద్దు.

ఏమిటి విశేషాలు ?

ఏమున్నాయి. వొద్దు వొద్దు. చెప్పేస్తా చెప్పొద్దు.

ఏమిటి విశేషాలు ?

ఏమున్నాయి ? వొద్దు, చెప్పేస్తావా ?

"రాత్రి యేమయిందో తెలుసా" అదుగో చెప్పేస్తున్నావు. నీకు బుద్ధిలేదు.

ఏమయింది యేమయింది ? వాడికెంత ఆతురత !

కుముదినీ, కమలాకరరావు ఒకరి భుజాల మీద ఒకరు చేతులు వేసుకొని....హాయిగా పెండ్లి చేసుకున్న దంపతులు కూడా అట్లా పోరనుకో, పచ్చి అబద్ధం. యింత విషం నీ హృదయంలో వుందా! మైగాడ్ యింత విషం నా హృదయంలో వుందా ? రైటో.... క్రిస్టిన్ కీలర్ యిన్ ఆర్ట్సుకాలేజీ... అబ్బ యెంత అల్లరి యెంత పాడుపని చేశాను. యెంత దుర్బలుణ్ని! నేను యెప్పుడూ యింతే "ఔను నువ్వు యెప్పుడూ యింతే".